సాక్షి నిజామాబాద్

గురువారం । 14 । ఆగస్టు । 2025



అధికారులు, సిబ్బంది..
భారీ వర్ష సూచనల నేపథ్యంలో అధికారులు కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. - 8లో ▸



పదోన్నతుల కోసం..
ప్రభుత్వ టీచర్ల తీరు మారడం లేదు. పదోన్నతుల కోసం నకిలీ, గుర్తింపులేని విద్యా సంస్థల నుంచి ధ్రువపత్రాలు తీసుకువస్తున్నారు. - 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 34.6 /22.8
ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. జిల్లావ్యాప్తంగా సాధారణం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

సింగూరు ప్రాజెక్టు గేటు ఎత్తివేత

నిజాంసాగర్: ఎగువన వర్షాలు దంచి కొట్టడంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకుంటున్నాయి. బుధవారం సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు 11 వ నంబర్ గేటును ఎత్తి, 7,694 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ఈ నీరు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వచ్చి చేరనుంది.

'సాగర్'లోకి 16 వందల క్యూసెక్కులు..
నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 1,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. బుధవారం సాయంత్రానికి 1,300.93 అడుగుల (5.67 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

12,769 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
బాల్కొండ:శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 12,769 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. అవుట్ ఫ్లో తక్కువగా, ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండటంతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది.

బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా జాదవ్ కృష్ణ



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా జాదవ్ కృష్ణ బుధవారం రాత్రి బాధ్యతలు తీసుకున్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీ కమిషనర్‌గా పనిచేసిన కృష్ణ పలు ఆరోపణల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆ తరువాత ఆరోపణలు అవాస్తవమని తేలడంతో సీడీఎంఏ ఆయనను బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పంద్రాగస్టు వేడుకకు ముఖ్య అతిథిగా బీసీ కమిషన్ చైర్మన్

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ హాజరవుతారని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారని, వేడుకలను ఘనంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

17న షటిల్ బ్యాడ్మింటన్ జిల్లాస్థాయి ఎంపికలు



నిజామాబాద్‌నాగారం: ఈ నెల 17న జిల్లాస్థాయి బాల బాలికల షటిల్ బాడ్మింటన్ ఎంపికలు నిర్వహించనున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి వాసు, కేవీ కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-11, 13,15 విభాగంలో బాలబాలికలకు పోటీలు ఉంటాయన్నారు. మోపాల్ మండల కేంద్రంలోని ఫిట్‌నెస్ క్లబ్‌లో ఎంపికలు నిర్వహిస్తామని, వివరాలకు ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ 9848351255 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

శాలువాలు, బొకేలు వద్దు

- ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: తనను కలిసేందుకు వచ్చే పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు బొకేలు, శాలువాలు తీసుకురావొద్దని ఎంపీ అర్వింద్ ధర్మపురి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. వాటికి బదులు నోట్‌బుక్స్, పెన్నులు వంటివి తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

బ్యాక్‌వాటర్‌లో పర్యాటకులకు నో ఎంట్రీ

- అప్రమత్తంగా ఉండాలని ముంపు గ్రామాల ప్రజలకు సూచన

డొంకేశ్వర్(ఆర్మూర్): ఎస్సారెస్పీకి వరద పెరుగుతున్న నేపథ్యంలో డొంకేశ్వర్ మండలంలోని బ్యాక్‌వాటర్ ప్రాంతానికి మూడు రోజులపాటు పర్యాటకులు రావొద్దని తహసీల్దార్ నరేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా జీజీ నడ్కుడ, గాదేపల్లి, చిన్నయానంతోపాటు గంగా సముందర్, మారంపల్లి, అన్నారం, సిర్పూర్, నికాల్‌పూర్ శివారులో బ్యాక్‌వాటర్ ప్రాంతాలకు పర్యాటకులు రాకుండా నియంత్రించాలని వీడీసీలకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మూడు రోజులు సెలవులు ఉన్నందున పర్యాటకులు వచ్చే అవకాశం ఉందని, వరద పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.

బ్యాక్‌వాటర్ ప్రాంతానికి పశువులు, గొర్రెలను మేతకు తీసుకెళ్లొద్దని, కాపరులు అటువైపు వెళ్లకుండా గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. గోదావరికి ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. నికాల్‌పూర్-కోమట్‌పల్లి రోడ్డు మధ్యలో వాగు ప్రవహించే అవకాశాలున్నాయని, ప్రమాదాలు జరగకుండా దారిని మూసివేయిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

జిల్లా కేంద్రంలోని రఘునాథ చెరువులో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఆయాశాఖల అధికారులు, సిబ్బంది



అప్రమత్తం

- సాధారణ వర్షపాతమే.. అయినా అలర్ట్
- భారీ వర్ష సూచనల నేపథ్యంలో అధికారయంత్రాంగం చర్యలు

భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం జిల్లాలోని 15 మండలాల్లో సాధారణ వర్షపాతమే నమోదు కాగా, 18 మండలాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 13.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కమ్మర్‌పల్లి మండలంలో 24.7 మి.మీ., భీమ్‌గల్ మండలంలో 20.3, డొంకేశ్వర్ మండలంలో 16.5, ఆలూరు మండలంలో 23.7, మోర్తాడ్ మండలంలో 22.0, ముప్కాల్ మండలంలో 20.2 మిల్లీ మీటర్ల వర్షం కురవగా, అత్యధికంగా మెండోరా మండలంలో 42.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. – నిజామాబాద్ అర్బన్

రఘునాథ చెరువులో మాక్‌డ్రిల్

ఖలీల్‌వాడి: భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో వరదలు, వర్షపు నీటిలో చిక్కుకున్న వ్యక్తులను రక్షించడంపై జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. నిజామాబాద్ నగరంలోని రఘునాథ చెరువు(మినీ ట్యాంక్‌బండ్)లో అగ్నిమాపక, ఏడో బెటాలియన్, ఎస్‌డీఆర్‌ఎఫ్, మత్స్యశాఖకు చెందిన గజ ఈతగాళ్లతో మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్ తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్ ఫైర్ సిబ్బంది (87126 99224), ఎస్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌చార్జి అధికారి (87126 99225), జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి (87126 99141) నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.



నిజామాబాద్‌లోని రఘునాథ చెరువులో మాక్‌డ్రిల్..

అత్యవసరమైతేనే బయటికి రండి

- అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలి
- మండలాల్లో కంట్రోల్ రూమ్‌లు
- భారీ వర్ష సూచన నేపథ్యంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సమీక్ష
- జాగ్రత్తలు, సహాయక చర్యలపై యంత్రాంగానికి దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్: రానున్న రెండు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. ప్రజలను అప్రమత్తం చేయాలని, ఎక్కడ కూడా ఏ చిన్న అవాంఛనీయ ఘటన చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించి, జాగ్రత్తలు సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మొదలుకుని జిల్లా పంచాయతీ అధికారి వరకు, ఆశాలు, ఏఎన్‌ఎంల నుంచి జిల్లా వైద్యారోగ్య అధికారి వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అందరూ స్థానికంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితి కారణంగా సెలవులను కూడా రద్దు చేసినట్లు తెలిపారు. అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటికి రావాలని ప్రజలకు సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సమయాలలో చేపట్టే సహాయక చర్యలపై ప్రజలకు భరోసా కల్పించేలా నిజామాబాద్ నగరంతోపాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ పట్టణాల్లో ఆయా వార్డుల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. గతంలో వరద ప్రభావానికి గురైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఇదివరకు ఏర్గట్ల మండలం తడ్‌పాకల్ గోదావరి పరీవాహక ప్రాంతంలో పలువురు వరద ప్రవాహంలో చిక్కుకున్న ఘటనను కలెక్టర్ గుర్తు చేశారు. అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని మండలాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్, రెవెన్యూ, పోలీసు, ఆర్‌అండ్ బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, వైద్యారోగ్యం, వ్యవసాయ తదితర శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ, జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఎలాంటి ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ దిలీప్‌కుమార్

అలీసాగర్ ఉద్యానవనం మూసివేత

- మూడు రోజులపాటు బోటింగ్ బంద్

బోధన్: ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్ గ్రామ శివారులో ఉన్న అలీసాగర్ ఉద్యావనాన్ని గురువారం నుంచి శనివారం వరకు మూసివేయనున్నారు. రిజర్వాయర్‌లో బో టింగ్ నిలిచిపోనుంది. బుధవారం సాయంత్రం రెవెన్యూ, నీటిపారుల, పోలీస్, మండల పరిషత్ అధికారుల బృందం అలీసాగర్ ఉద్యానవనాన్ని సందర్శించి ఈ నిర్ణయం తీసుకుంది. పర్యాటకులు మూడు రోజుల పాటు అలీసాగర్ ఉద్యావనానికి రావొద్దని అధికారులు సూచించారు. భారీ వర్ష సూచ న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. తహసీల్దార్ దత్తాద్రి, ఎంపీడీవో శంకర్, ఎస్సై ముత్యాల రమ, నీటిపారుదల శాఖ ఏఈ కుషాల్ అలీసాగర్‌ను సందర్శించారు.

విద్యుత్ కంట్రోల్ రూం ఏర్పాటు

- కరెంట్ సరఫరాపై జాగ్రత్త వహించాలి
- మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ వాహనాలు సిద్ధం
- ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ రవీందర్



సుభాష్‌నగర్: మూడు రోజులపాటు అతి భారీ వర్ష సూచన నేపథ్యంలో విద్యుత్ సరఫరాపై వినియోగదారులు, రైతులు అత్యంత జాగ్రత్త వహించాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ రాపెల్లి రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్ చేస్తున్నామని, మెన్, మెటీరియల్ అందుబాటులో ఉంచామని తెలిపారు. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ వాహనాలను సిద్ధం చేశామని, ఉద్యోగులకు షిఫ్ట్ విధానంలో 24 గంటల విధులు కేటాయించామని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే పునరుద్ధరించేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నివారణ, అంతరాయాల సమస్య పరిష్కారం కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, 87124 85205 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకొద్దని, ప్రమాదకరంగా ఉన్నట్లు గమనించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి, టీజీఎన్‌పీడీసీఎల్ టోల్ ఫ్రీ నెంబర్ 1912కు సమాచారం అందించాలని కోరారు. ప్రధానంగా రైతులు మోటార్లు, పైపులు, ఫుట్ వాల్వులను ఏమరపాటుతో తాకొద్దని, వ్యవసాయ పంపుసెట్లు, స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారికంగా మరమ్మతులు చేయొద్దని, పనులేమైనా ఉంటే విద్యుత్ సిబ్బందికి సమాచారమివ్వాలని ఎస్‌ఈ కోరారు.

వాగుల వైపు వెళ్లొద్దు..



ఖలీల్‌వాడి: రాబోయే రెండు, మూడు రోజు ల్లో వర్ష సూచన దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ పోతరాజు సాయిచైతన్య సూచించారు. ప్రజల భద్రత దృష్ట్యా పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రతిరోజూ అందుబాటులో ఉండాలని అన్నారు. వాగుల వైపు, జలాశయాలు, చెరువులు, కుంటలు చూసేందుకు వెళ్లొద్దని ప్రజలకు సూచించారు. పురాతన కట్టడాలు, ఇళ్లు, గోడలు ఉంటే వర్షతాకిడికి పడిపోయే అవకాశా లున్నాయని, ప్రజలు పునరావాస కేంద్రాల కు వెళ్లాలని సూచించారు. ఎక్కడైనా వరద ఉధృతి తలెత్తితే వెంటనే స్పందించి సహాయ క చర్యలు చేపట్టి ప్రాణ నష్టం లేకుండా చూ డాలని అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. అన్నిశాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 87126 59700ను లేదా స్థానిక పోలీస్ స్టేషన్ నంబర్‌ను సంప్రదించాలని సీపీ సూచించారు.

అగమ్య గోచరంగా జిల్లా పరిస్థితి

- కాంగ్రెస్ అవినీతిని ప్రజలు గమనిస్తున్నారు
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఏ జీవన్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్: జిల్లా పరిస్థితి అగమ్య గోచరంగ మారిందని, జిల్లాను పట్టించుకున్న వారే కరువయ్యారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు మంత్రి లేరని, తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఉన్నా ఆయన ఏనాడూ జిల్లాను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు అవినీతి, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వారి అవినీతిని ప్రజలు గమనిస్తున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా రెపరెపలాడడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేస్తున్నారని విమర్శించారు. ఆరు గ్యారెంటీల అమలును విస్మరించారని, ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ.2500 ఇస్తామన్న హామీ అమలు కావడం లేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కూడా ఇవ్వడం లేదన్నారు. తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ చీరలు ఇవ్వడం లేదన్నారు, క్రిస్మస్, రంజాన్ కానుకలు మర్చిపోయారని విమర్శించారు. సమావేశంలో పార్టీ నాయకులు ప్రభాకర్, సుజిత్ సింగ్ ఠాకూర్, రాజేశ్వర్‌రెడ్డి, మస్తా ప్రభాకర్, పూజా నరేంద్ర, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సవాల్‌గా సమస్యల పరిష్కారం

- భూభారతి దరఖాస్తులు 40468
- పరిష్కారమైనవి 1320
- నేటితో ముగుస్తున్న గడువు
- మరింత సమయం పట్టే అవకాశం



నిజామాబాద్ అర్బన్: భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి అధికారులకు తలనొప్పిగా మారింది. జిల్లాలో 453 రెవెన్యూ సదస్సులు నిర్వహించిన అధికారులు 40,468 దరఖాస్తులను స్వీకరించారు. భూ సమస్యలను ఆగస్టు 14వ తేదీ లోగా పరిష్కరిస్తామని ప్రకటించగా, నేటితో గడువు ముగియనుంది. కాగా మొత్తం దరఖాస్తుల్లో సగం దరఖాస్తులు కూడా పరిష్కారానికి నోచుకోలేదు. ఇందుకు ప్రధాన కారణం కోర్టు కేసులకు సంబంధించిన వ్యవహారాలే. ఉండడం గత కొన్నేళ్ల నుంచి పరిష్కారం కానీ సమస్యలు ఉండడమే ప్రధాన కారణం. సాదా బైనామా దరఖాస్తులు 9,185 ఉండగా, ప్రభుత్వ భూముల నుంచి పట్టా భూములుగా మార్చేందుకు 9,233, ఇతర సమస్యలకు సంబంధించి 4,189 దరఖాస్తులు అందాయి. స్వీకరించిన మొత్తం స్వీకరించిన దరఖాస్తుల్లో 22,607 దరఖాస్తులను పరిష్కరించేందుకు అవకాశం ఉందని గుర్తించినప్పటికీ 1320 దరఖాస్తులను మాత్రమే పరిష్కరించారు. మరో 2449 దరఖాస్తులు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇదివరకే 28,072 మందికి దరఖాస్తులకు అనుగుణంగాసమస్యల పరిష్కారానికి సంబంధించి నోటీసులు అందించారు. వీటి పరిశీలన ప్రస్తుతం కొనసాగుతోంది.

ఆ దరఖాస్తులే ఎక్కువ..
భూభారతి దరఖాస్తుల్లో ఎక్కువగా సాదాబైనామా, ప్రభుత్వ భూమి నుంచి పట్టా భూమిగా మార్పిడి, పేరు మార్పిడికి సంబంధించిన దరఖాస్తులే ఎక్కువగా ఉన్నాయి. వీటిని పరిశీలించి పరిష్కరించే అవకాశం ఉంది. అయితే క్షేత్రస్థాయికి అధికారులు వెళ్లినప్పుడు దరఖాస్తుదారు అందుబాటులో ఉండకపోవడం, సర్వే నంబర్లు ఇతరత్రా ఇబ్బందులు ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కోర్టు కేసులూ జాప్యానికి కారణమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి రెవెన్యూ బందాలను కూడా అధికారులు ఏర్పాటు చేయగా, దరఖాస్తుల పరిశీలనకు ఎక్కువ సమయం తీసుకోవడంతో మరింత సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వం విధించిన గడువు మళ్లీ పొడిగించే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. మొత్తం దరఖాస్తుల్లో ఇప్పటి వరకు ఇప్పటివరకు 1,320 దరఖాస్తులను మాత్రమే క్లియర్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వమే నిధులు ఇవ్వడం లేదు

- నిధులను ఇతర పనులకు మళ్లించారు
- ఆగిపోతున్న రైల్వే బ్రిడ్జిల పనులు
- మీడియాతో ఎంపీ అర్వింద్



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో జరుగుతున్న రైల్వే అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వమే నిధులు కేటాయించడం లేదని, ఆలస్యం చేస్తోందని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలో జరుగుతున్న రైల్వే పనులకు సంబంధించి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అడవి మామిడిపల్లి, అర్సపల్లి, మాధవ్ నగర్ వద్ద రైల్వే బ్రిడ్జిల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అడవి మామిడిపల్లిలో సుమారుగా పనులు పూర్తి కావచ్చాయని, దీనికి సంబంధించిన నిధులను నాటి మంత్రి ప్రశాంత్ రెడ్డి రూ. 17 కోట్లను ఇతర పనులకు మళ్లించారని పేర్కొన్నారు. దీనివల్లనే పనులలో ఆలస్యం అన్నారు. మాధవ నగర్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయని, దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూ. 11 కోట్లు కేటాయించవలసి ఉందన్నారు. అర్సపల్లి వద్ద నిర్మించే రైల్వే బ్రిడ్జికి సంబంధించి మొత్తం రూ. 137 కోట్లు కాగా, ఇందులో కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద రూ. 127 కోట్లు కేటాయించిందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ. 10 కోట్లు ఇప్పటికీ కేటాయించలేదన్నారు. రైల్వే బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించి వారం రోజుల్లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిని కలిసి నిధులు విడుదల చేయాలని కోరనున్నట్లు తెలిపారు. జిల్లాలో మిగతా అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర మంత్రులను కలిసి నిధులు వచ్చేలా చూస్తానన్నారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పెండింగ్ బకాయిలను విడుదల చేయించినట్లు తెలిపారు.

ఐఎంఏ అధ్యక్షుడిపై ప్రశ్నల వర్షం

- అజ్జ శ్రీనివాస్ వ్యవహారంపై వైద్య వర్గాల్లో చర్చ
- షణ్ముగం మహాలింగంను పరిచయం చేసింది మీరే కదా..? అని మండిపాటు
- అసోసియేషన్ పరువుపోతోందని మండిపడ్డ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: క్రిస్టియన్ మెడికల్ కళాశాల, ఆస్పత్రి (సీఎంసీ)లో డైరెక్టర్‌నని చెప్పుకుని వివాదాలకు కేంద్రంగా మారిన ఐఎంఏ అధ్యక్షుడు అజ్జ శ్రీనివాస్‌పై సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మంగళవారం రాత్రి నిర్వహించిన సమావేశానికి హాజరైన వారిలో పలువురు కార్యవర్గ సభ్యులు.. మీ వ్యక్తిగత లబ్ధికోసం ఐఎంఏ పేరును ఎలా వాడుకుంటారని అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. మహాలింగంను తీసుకువచ్చి పరిచయం చేసింది మీరు కదా? అని ప్రశ్నించగా, ఐఎంఏ అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి వేరే బిజినెస్‌లు చేసుకోవద్దా? అని అజ్జ శ్రీనివాస్ సమావేశానికి హాజరైన వారిని ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది.

పరిచయం చేసింది ఆయనే..
కొన్ని నెలల క్రితం నిజామాబాద్ నగరంలోని హోటల్ నిఖిల్ సాయిలో నిర్వహించిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి షణ్ముగం మహాలింగంను తీసుకొచ్చిన అజ్జ శ్రీనివాస్ అక్కడి వైద్యులందరికీ పరిచయం చేశారు. మహాలింగం రిటైర్డ్ ఐఏఎస్ అని, మరికొందరితో కలిసి ఆయన సీఎంసీని ప్రారంభిస్తున్నారని చెప్పాడు. సీఎంసీ ప్రారంభమైతే జిల్లాలోని వైద్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పాడు. ఆ తరువాత కొద్ది కాలానికి డైరెక్టర్‌గా చేరిన ఆయన 26 మంది వైద్యులను, స్టాఫ్‌నర్సులతోపాటు పలువురిని ఉద్యోగాల పేరుతో సీఎంసీలో చేర్చారు. నియామకాల వ్యవహారంలో శ్రీనివాస్ వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ఐఎంఏ అధ్యక్షుడిగా కొనసాగుతున్న అజ్జ శ్రీనివాస్ ఐఎంఏ పరువు తీశారని వైద్యులు చర్చించుకుంటున్నారు. కార్యవర్గ సమావేశంలో కొంతమంది అధ్యక్షుడిని ప్రశ్నించగా, మరికొంత మంది అధ్యక్షుడు చేసిన తప్పులు క్షమించారనివంటూ డిన్నర్ సమయంలో గుసగుసలాడుకున్నారు. ఇప్పటికే లీ గల్ నోటీసులు, కేసులతో పోలీసుల వద్దకు చేరిన సీఎంసీ పంచాయితీలో బాధ్యులపై చర్యలు ఏవిధంగా ఉంటాయో వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా

కాకతీయ కాలువకు తగ్గిన నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను అధికారులు తగ్గించారు. కాకతీయ కాలువకు 2500, లక్ష్మి కాలువ ద్వారా 150, సరస్వతి కాలువ ద్వారా 800 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతోంది. అలీసాగర్, గుత్ప లిఫ్ట్ ద్వారా నీటి విడుదలను నిలిపివేశారు. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరిరూపంలో 482 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1080.10(45.16టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి



ఖలీల్‌వాడి: నషా ముక్త్ భారత్ అభియాన్ ఐదో వార్షికోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ రీజియన్ సమావేశ మందిరంలో మాదకద్రవ్యాల వ్యతిరేక సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న మాట్లాడుతూ మాదకద్రవ్యాల నివారణ, డ్రగ్స్ రహిత జీవన శైలి పాటించడం, అక్రమ రవాణా నిరోధించాలన్నారు. బస్సుల్లో గంజాయి వంటి మత్తు పదార్థాలు రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాత్రంతా విధుల్లోనే..



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు డొంకేశ్వర్ మండల అధికారులు బుధవారం రాత్రంతా విధుల్లోనే ఉన్నారు. తహసీల్దార్ నరేశ్ కుమార్‌తో కలిసి ఎంపీడీవో లక్ష్మి ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి మధుసూదన్, రెవెన్యూ సిబ్బంది తహసీల్ కార్యాలయంలోనే ఉండి పరిస్థితులను సమీక్షించారు. ఆయా గ్రామాల ప్రజలతో ఫోన్‌లో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని హస్గుల్ క్వారీ నుంచి మంగళవారం రాత్రి సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం తడ్కల్ గ్రామానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సముందర్ తండా శివారులో పోలీసులు పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు.అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై అరుణ్ కుమార్ హెచ్చరించారు.

పదోన్నతుల కోసం పాకులాట

- తీరు మార్చుకోని కొందరు టీచర్లు
- నకిలీ, గుర్తింపులేని విద్యా సంస్థల నుంచి ధ్రువపత్రాలు
- ఉన్నతాధికారులకు విన్నవించిన విద్యాశాఖ అధికారులు

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ టీచర్ల తీరు మారడం లేదు. పదోన్నతుల కోసం నకిలీ, గుర్తింపులేని విద్యా సంస్థల నుంచి తీసుకువచ్చిన ధ్రువపత్రాలు సమర్పించడం గత కొన్నేళ్లుగా మామూలు విషయంగా మారింది. ఇతర రాష్ట్రాలకు చెందిన దూరవిద్య ధ్రువపత్రాలను సమర్పిస్తూ విద్యాశాఖ అధికారులను బురిడీ కొట్టిస్తున్నారు. 2013లో నకిలీ ధ్రువపత్రాల వ్యవహారం సంచలనం సృష్టించింది. రాత్రికి రాత్రే ధ్రువపత్రాలు సమర్పించిన ఘటనలపై పాఠశాల విద్యాశాఖ సీరియస్‌గా స్పందించింది. కొందరిని రివర్షన్ చేయగా, మరికొందరిపై చర్యలు తీసుకుంది. అయినా టీచర్ల తీరు మారడం లేదు.

235 మందికి పదోన్నతుల అవకాశం!

ప్రస్తుతం విద్యాశాఖలో ప్రదోన్నతుల ప్రక్రియ ప్రారంభమై ధ్రువపత్రాల పరిశీలన పూర్తయ్యింది. జిల్లాలో 235 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు వచ్చే అవకాశం ఉంది. 1:3 ప్రకారం ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. అయితే 26 మంది ఉపాధ్యాయులు ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యాసంస్థల నుంచి తీసుకువచ్చిన ధ్రువపత్రాలను సమర్పించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు గుర్తించారు. ముఖ్యంగా గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో ఎక్కువగా ఈ ధ్రువపత్రాలు ఉన్నట్లు గుర్తించి సంబంధిత టీచర్లకు విద్యాశాఖ సిబ్బంది ఫోన్ల ద్వారా సమాచారం అందించారు. ఉన్నతాధికారులకు నివేదించామని, మీ పదోన్నతుల వ్యవహారం నిలిపివేసినట్లు స్పష్టం చేశారు. దీంతో ఉపాధ్యాయులు హుటాహుటిన జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి తరలివచ్చారు. తాము చదివిన దూరవిద్య కేంద్రం సక్రమమేనని చెప్పుకొచ్చారు. కానీ ఉన్నత విద్యాశాఖ ఇటీవల అనుమతి ఉన్న దూరవిద్య కేంద్రాల వివరాలను వెల్లడించింది. కొందరు ఉపాధ్యాయులు ఆంధ్రప్రదేశ్‌లోని పద్మావతి యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్లు తీసుకురాగా, ఆ యూనివర్సిటీ సర్టిఫికెట్లను ప్రమోషన్ల ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోబోమని గతంలోనే స్పష్టం చేశారు. అలాగే వినాయక విద్య మిషన్‌ను గుర్తింపులేని విద్యా సంస్థగా ప్రకటించినప్పటికీ ఆ విద్యా సంస్థ సర్టిఫికెట్లను మరికొందరు తీసుకువచ్చారు.

జిల్లాలోనే..

జిల్లాలో నకిలీ సర్టిఫికెట్లను అంగట్లో సరుకులా విక్రయిస్తున్నారు. ప్రధానంగా ఆర్మూర్‌తోపాటు నిజామాబాద్‌లో మూడు చోట్ల ఈ నకిలీ ధ్రువపత్రాల దందా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కామారెడ్డికి చెందిన ఓ ప్రభుత్వ టీచర్ ఇతర రాష్ట్రాలకు చెందిన డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విద్యాలయాలతో సంబంధాలు కొనసాగిస్తూ ఇక్కడి టీచర్లకు నకిలీ ధ్రువపత్రాలను అంటగడుతున్నారు. రూ.2 లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఒక్కో ధ్రువపత్రాన్ని విక్రయిస్తున్నారు. అలాగే ఆర్మూర్‌లోని ఓ ప్రభుత్వ లెక్చరర్ నకిలీ ధ్రువపత్రాల దందా చేస్తున్నట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో మాక్లూర్ మండలం చెందిన ఓ వ్యక్తి గత కొన్నేళ్లుగా నకిలీ ధ్రువపత్రాలను విక్రయిస్తున్నాడు. ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటే నకిలీ సర్టిఫికెట్ల విక్రయాలకు ముకుతాడు పడే అవకాశం ఉంది.

ఉన్నతాధికారులకు విన్నవించాం

పదోన్నతుల్లో భాగంగా ఇటీవల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టాం. కొందరు టీచర్లు ఇతర రాష్ట్రాలకు చెందిన ధ్రువపత్రాలను సమర్పించారు. వాటికి అనుమతి లేదని తెలిసింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖకు నివేదించాం. వారి నిర్ణయం మేరకే తుది నిర్ణయం ఉంటుంది.

– అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లాలో డ్రైపోర్టు ఏర్పాటు చేయాలి

ఎంపీకి సాధన కమిటీ సభ్యుల వినతి



ఎంపీ అర్వింద్‌కు వినతిపత్రం అందజేస్తున్న డ్రైపోర్టు సాధన కమిటీ సభ్యులు

సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో డ్రైపోర్టు ఏర్పాటు చేయాలని డ్రైపోర్టు సాధన కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీ అర్వింద్ ధర్మపురిని నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డ్రైపోర్టు సాధన కమిటీ సభ్యులు మాట్లాడుతూ నిజామాబాద్‌ను పారిశ్రామికీకరణ చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. యువత, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు, వారిని ఆర్థికంగా శక్తివంతం చేసేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో ఏదైనా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థను ఏర్పాటు చేసేలా చొరవ చూపాలని విజ్ఞప్తిచేశారు. కాగా, డ్రైపోర్టు ఏర్పాటు విషయంలో వీలైనంత త్వరగా ఫిజిబిలిటీ రీసెర్చ్ చేయిస్తానని ఎంపీ హామీనిచ్చినట్లు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో డ్రైపోర్టు సాధన కమిటీ సభ్యులు ఎస్ దినేశ్ రెడ్డి, హితేన్, లక్ష్మణ్, బీజేపీ నాయకులు గోపిడి ప్రవంతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

- కలెక్టర్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి లేఖ

సుభాష్‌నగర్: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లను పేదలకు కేటాయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి లేఖ రాశారు. కలెక్టరేట్‌ను ఆనుకొని ఖానాపూర్ శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు పూర్తయినప్పటికీ లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని ఆవేదన వ్యక్తంచేశారు. పేదలకు ఇళ్లు కేటాయించకపోతే, ఈ నెల 15న ఉదయం 11 గంటలకు వారితో కలిసి తామే స్వయంగా గృహప్రవేశం చేస్తామని తెలిపారు.

దరఖాస్తు లేకుండానే కుల ధ్రువీకరణ పత్రం

- నూతన విధానాన్ని అమలులోకి తెచ్చిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు
- అవగాహన కల్పించని అధికారులు



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): కుల ధ్రువీకరణ పత్రాల జారీలో రాష్ట్ర ప్రభుత్వం పలు మార్పులు చేసింది. మీసేవ నుంచి పత్రాన్ని పొందిన వ్యక్తి మరోసారి దరఖాస్తు చేసే వెసులుబాటు గతంలో ఉండేది. కులం మారదు కనుక ఇప్పుడు అలాంటి విధానానికి స్వస్తి పలకడంతోపాటు ప్రభుత్వం నూతన విధానాన్ని అమలులోకి తెచ్చింది. కుల ధ్రువీకరణపత్రం గతంలో 'కమ్యూనిటీ డేట్ ఆఫ్ బర్త్' గా వచ్చేది. దీంతోపాటు ఆధార్ కార్డు ప్రకారం పుట్టిన తేదీ వివరాలు వచ్చేవి. ప్రస్తుతం కుల ధ్రువీకరణ పత్రంలో జనన వివరాలు అవసరం లేదని ప్రభుత్వం గుర్తించింది. పత్రంలో ఈ వివరాలను తొలగించి కేవలం 'కమ్యూనిటీ' పేరుతోనే నూతన పత్రాన్ని జారీ చేస్తోంది. కొత్త విధానంతో ధ్రువపత్రాలు పొందడానికి క్షణాల్లో పని పూర్తయితే బాగానే ఉంటుంది. కానీ, గతంలో పొందిన కుల ధ్రువపత్రాల్లో ఏవైనా తప్పులు ఉంటే వాటిని మార్చుకునే వెసులుబాటు లేదు.

ఎస్సీ వర్గానికి వర్తించదు..

కుల ధ్రువీకరణ పత్రం జారీలో అన్ని సామాజిక వర్గాలకు పాత ధ్రువపత్రం చూపిస్తే అప్పటికప్పుడు కుల ధ్రువీకరణ పత్రం జారీ కానుండగా ఎస్సీ సామాజిక వర్గానికి మాత్రం వర్తించదని అధికారులు చెబుతున్నారు. వారు కొత్తగా దరఖాస్తు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు.

ప్రచారం కరువు..

నూతన విధానంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అధికార యంత్రాంగం ప్రేక్షకపాత్ర పోషిస్తోంది. నూతన మార్పులను పత్రికా ప్రకటనల ద్వారా ప్రజలకు తెలపాల్సి ఉండగా తదనుగుణ చర్యలు లేకపోవడం గమనార్హం. కొత్త విధానంలో కులధ్రువీకరణ పత్రం ఎలా తీసుకోవాలో తెలియక చాలామంది పాత విధానాన్నే అనుసరిస్తూ సమయంతోపాటు డబ్బు వృథా చేసుకుంటున్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులను సంప్రదించగా ప్రభుత్వం నుంచి ఇంకా గైడ్‌లైన్స్ రాలేదని రాగానే ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

పాత సర్టిఫికెట్ చూపిస్తే సరి..

ఇక మీదట ప్రతిసారి కుల ధ్రువీకరణ పత్రం పొందడానికి దరఖాస్తు చేయాల్సిన పని లేదు. పాత ధ్రువీకరణ పత్రంలోని నంబర్ లేదా ఆధార్ ద్వారా అప్పటికప్పుడు మీసేవలో సర్టిఫికెట్ తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో విద్యార్థులు, ఇతరత్రా వారికి సేవలు సులభతరం కానున్నాయి. గతంలో మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకొని, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నాయబ్ తహసీల్దార్, తహసీల్దార్ ఆమోదం పొందిన తర్వాత కుల ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి వచ్చేది. ఈ ప్రక్రియకు కనీసం పక్షం రోజులు సమయం పట్టేది. కొత్త విధానంలో భాగంగా పాత సర్టిఫికెట్ చూయించి వెంటనే కొత్త సర్టిఫికెట్ పొందే అవకాశం కల్పించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అధికారులు, సిబ్బంది కార్యస్థానాల్లో ఉండాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- నిజామాబాద్ రూరల్‌లో ఆకస్మిక తనిఖీలు
- తిర్మన్‌పల్లి ఏఈవోపై ఆగ్రహం



వ్యవసాయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్ రూరల్: భారీ వర్ష సూచనల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కార్యస్థానాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. కార్యస్థానాల్లో ఉండని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజామాబాద్ రూరల్ మండలం తిర్మన్‌పల్లి, పాల్దా గ్రామాలలో కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తిర్మన్‌పల్లి రైతువేదికను సందర్శించిన కలెక్టర్.. ఏఈవో అందుబాటులో లేకపోవడంపై అసహనం వ్యక్తంచేశారు. రైతు వేదికకు తాళం వేసి ఉండడం, పలువురు రైతులు బయట నిరీక్షిస్తుండడాన్ని గమనించిన కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందుకు ఫోన్ చేసి అక్కడికి పిలిపించారు. అదే సమయంలో ఏఈవో కూడా చేరుకోగా, రైతువేదిక వద్ద అందుబాటులో లేకుండా ఎక్కడికి వెళ్లావంటూ కలెక్టర్ నిలదీశారు. కార్యస్థానాలలో ఉండాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ నిర్లక్ష్యం వహించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. పాల్దా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత నిరుపయోగంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, దాని నిర్వహణను చక్కబెట్టాలని ఏపీవోను ఆదేశించారు. పాఠశాలకు 30 మంది విద్యార్థులు హాజరుకాగా, ముఖ గుర్తింపు విధానం ద్వారా 25 మంది హాజరు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయడాన్ని గమనించిన కలెక్టర్, మిగతా విద్యార్థులు ఎఫ్ఆర్ఎస్ హాజరు విషయమై హెచ్ఎం సుమన్ రెడ్డిని ప్రశ్నించారు. సాంకేతిక కారణాలతో నమోదు కాలేదని హెచ్ఎం తెలుపగా, కలెక్టర్ తన సమక్షంలో విద్యార్థులు హాజరును ఎఫ్ఆర్ఎస్ విధానంలో నమోదు చేయించారు. ఎఫ్ఆర్ఎస్ నమోదులో సాంకేతిక సమస్యలు తలెత్తితే ఎవరిని సంప్రదించాలనే విషయమై జిల్లాలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలకు టెక్నికల్ పర్సన్ ఫోన్ నెంబర్, తదితర వివరాలతో కూడిన సమాచారాన్ని చేరవేయాలని ఫోన్ ద్వారా డీఈవోను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. సహకార సంఘం ఎరువుల గిడ్డంగిని తనిఖీ చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో యూరియా, ఇతర ఎరువులను అందజేసినట్లు సొసైటీ సీఈవో రాకేశ్, కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మరింత అందుబాటులో ఉంచేందుకు వీలుగా 10 టన్నుల వరకు ఎరువుల కోసం ఇండెంట్ పంపినట్లు తెలిపారు. పాల్దా గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలో 61 మంది చేరిక



తెయూ ఇంజినీరింగ్ కళాశాలలో అడ్మిషన్ తీసుకుంటున్న విద్యార్థి

తెయూ(డిచ్‌పల్లి): నూతనంగా ఏర్పాటైన తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో 3వ విడత కౌన్సెలింగ్‌లో 81 మందిని కేటాయించగా, బుధవారం సాయంత్రం వరకు 61 మంది విద్యార్థులు అడ్మిషన్స్ తీసుకున్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)లో 48 మంది, సీఎస్ ఐటీలో ముగ్గురు, సీఎస్ (ఏఐ)లో ఏడుగురు, డాటా సైన్స్‌లో ముగ్గురు విద్యార్థులు ప్రవేశాలు పొందినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి తెలిపారు.

హాస్టల్ వసతి లేక వెనుకంజ

ఇంజినీరింగ్ విద్యార్థులకు తెయూ క్యాంపస్‌లో హాస్టల్ వసతి కల్పించడం లేదు. దీంతో కౌన్సెలింగ్‌లో కేటాయించబడిన మరికొంత మంది విద్యార్థులు క్యాంపస్‌కు వచ్చి ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్న వసతి, సౌకర్యాలను తెలుసుకున్నారు. హాస్టల్ వసతి లేకపోవడంతో కొందరు బాలికలు ఇక్కడ అడ్మిషన్ తీసుకునేందుకు వెనుకంజ వేశారు. నాలుగు కోర్సులకు 264 సీట్లు అందుబాటులో ఉన్నప్పటికీ కళాశాల మంజూరులో ఆలస్యం కావడం, హాస్టల్ వసతి లేకపోవడంతో విద్యార్థులు తక్కువ సంఖ్యలో చేరడానికి కారణమవుతున్నట్లు తెలుస్తోంది. సీట్ల భర్తీకి ఇక స్పాట్ కౌన్సెలింగ్‌పైనే ఆశలు పెట్టుకోవాల్సి ఉంటుంది.

సివిల్ ప్రొసీజర్ కోడ్‌లో మెలకువలు నేర్చుకోవాలి

జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి



సీనియర్ న్యాయవాదులను సన్మానిస్తున్న జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి

నిజామాబాద్ లీగల్: యువ న్యాయవాదులు సివిల్ ప్రొసీజర్ కోడ్‌పై పట్టు సాధించినప్పుడే సివిల్ లాయర్‌గా వృత్తిలో స్థిరపడతారని జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి పేర్కొన్నారు. యువ న్యాయవాదుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన శిబిరం రెండోరోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. సీనియర్ సివిల్ న్యాయవాది సంగమేశ్వర్ రావు సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని వివిధ సెక్షన్లపై అవగాహన కల్పించారు. సీనియర్ సివిల్ అడ్వకేట్ జే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమయస్ఫూర్తితో ఆలోచిస్తే అనేక సమస్యలకు న్యాయశాస్త్రంలో పరిష్కారం దొరుకుతుందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కృపాకర్ రెడ్డి, వాల్గోట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

20 వరకు ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు అవకాశం

నిజామాబాద్ అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఎస్సీ, పీజీలో ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని ధ్రువపత్రాలను స్టడీ సెంటర్‌లో సమర్పించాలన్నారు.

వీడీసీ నిర్మించిన మడిగెలను సీజ్ చేయాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆదేశం
- సుర్బిర్యాల్ వీడీసీ ఆగడాలపై ఆగ్రహం



సుర్బిర్యాల్‌లో వీడీసీ నిర్మించిన షటర్లు

నిజామాబాద్ లీగల్: ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామంలో పంచాయతీ స్థలం ఆక్రమించడంతోపాటు అనుమతి లేకుండా నిర్మించిన 11 మడిగెలను సీజ్ చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆదేశించారు. సుర్బిర్యాల్ గ్రామంలో ఇటీవల మాదిగ కులానికి చెందిన వ్యక్తులపై వీడీసీ సాంఘిక బహిష్కరణ విధించింది. దీంతో బాధితులు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఉదయ్ భాస్కర్ రావును ఆశ్రయించారు. వీడీసీ సభ్యులు గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా 11 షెటర్లను నిర్మించారని, వాటిలో రెండింటిని ఓ అగ్రవర్ణ కుల సంఘానికి అప్పగించారని, అదేవిధంగా తమకు కేటాయించాలని అడుగగా వ్యతిరేకిస్తున్నారని వివరించారు. దీనిపై స్పందించిన సంస్థ కార్యదర్శి ఉదయ్ భాస్కర్ రావు సుర్బిర్యాల్ పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, ఆర్ఐ ప్రమోద్‌లను తన కార్యాలయానికి పిలిపించుకొని సాంఘిక బహిష్కరణకు దారితీసిన పరిస్థితులను తెలుసుకున్నారు. గ్రామంలో కొందరు వ్యక్తులు చట్టానికి అతీతులుగా వ్యవహరిస్తుంటే పైఅధికారులకు నివేదికలు ఇవ్వాల్సింది పోయి వారికి సహకరించడం తగదని అన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ షిరిడిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడీ వార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యభర్తలు కావలెను. ఫోన్: 8985114453, 9391036931. [HA-16124]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
Contact: 9492010949

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/- రూ॥లు
ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

మట్టిలో కూరుకుపోయి కూలీ మృతి



సురాజ్ నిశాద్(ఫైల్)

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44 విస్తరణ పనుల్లో బిహార్‌కు చెందిన సురాజ్ నిశాద్(40) అనే కూలీ మట్టిలో కూరుకుపోయి మృతి చెందాడు. ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం .. బిహార్ రాష్ట్రానికి చెందిన కొంతమంది కూలీలు ఓ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నారు. మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు విస్తరణలో పని చేసేందుకు సునీల్, సురాజ్, ధీరేంద్రయాదవ్, రాజు వచ్చారు. పనిలో భాగంగా పైపులను పక్కకు జరిపేందుకు సురాజ్, ధీరేంద్రయాదవ్‌లు గుంతలోకి దిగారు. ప్రమాదవశాత్తు పైపులైన్ పక్కన ఉన్న మట్టి పెల్లాలు కూలి సురాజ్ పూర్తిగా కూరుకుపోగా, ధీరేంద్రయాదవ్ ఛాతి వరకు మట్టి పడింది. ఇద్దరినీ హైవే అంబులెన్స్‌లో ఆర్మూర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే సురాజ్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, ధీరేంద్రయాదవ్ చికిత్స పొందుతున్నాడు.

చికిత్స పొందుతూ కేజీబీవీ విద్యార్థిని మృతి



కావేరి (ఫైల్)

నిజామాబాద్‌నాగారం/ఆర్మూర్: తీవ్రగాయాలతో ప్రగతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేజీబీవీ విద్యార్థిని కావేరి(16) బుధవారం ఉదయం మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని దుబ్బకు చెందిన కావేరి ఆర్మూర్ పట్టణం పెర్కిట్‌లో ఉన్న కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ నెల 5న అర్ధరాత్రి కేజీబీవీ భవనం నుంచి కావేరి కిందకు దూకింది. తలకు తీవ్రగాయాలు కావడంతో కేకలు వేసింది. స్పందించిన కేజీబీవీ సిబ్బంది వెంటనే స్థానికంగా ఉన్న ఎంజే ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ప్రగతి ఆస్పత్రికి తరలించారు. వారం రోజులుగా చికిత్స పొందిన కావేరి బుధవారం ఉదయం 8.40 నిమిషాల సమయంలో మరణించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

కోతులకు భయపడే..

కావేరి ఈ నెల 5న తెల్లవారుజామున హాస్టల్‌లోని వాష్‌రూంకు వెళ్లి వస్తుండగా కోతులు వెంటపడడంతో భయపడి హాస్టల్ పోర్టువాల్ ఎక్కి కిందకు దూకినట్లు కేజీబీవీ అధికారులు తెలిపారు. తలకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కాగా, కావేరి తండ్రి గణేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్మూర్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

రామారెడ్డి: ఆర్థిక ఇబ్బందులతో గడ్డి మందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు రామారెడ్డి ఎస్సై లావణ్య తెలిపారు. రామారెడ్డికి చెందిన పోగుల నాగరాజు (37) కొంతకాలంగా మద్యం, పేకాటకు బానిసయ్యాడు. దురలవాట్లతో అప్పులు కావడంతో మానసిక ఒత్తిడికి గురై ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. 9న గుర్తుతెలియని గడ్డి మందు తాగిన నాగరాజును కుటుంబసభ్యులు గుర్తించారు. వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

నవీపేట: మండల కేంద్రంలోని బాసర చౌరస్తా సమీపంలో ఇరిగేషన్ కాలువ స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టినట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీధర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారుల అనుమతి లేకుండా ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించిన రజక సంఘం ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన చాకలి గున్నాయి అనే వృద్ధురాలిపై బుధవారం కోతులు దాడిచేశాయి. గున్నాయి రోడ్డు వెంబడి వెళ్తుండగా ఒక్కసారి కోతులు దాడిచేసి తొడ భాగంలో గాయపరిచాయి. స్థానికులు వెంటనే ఆమెను స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో కామారెడ్డి కోర్టు కృష్ణ అనే వ్యక్తికి బుధవారం రెండ్రోజుల జైలుశిక్ష విధించింది. రెండు రోజుల క్రితం పట్టణ పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా కృష్ణ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. కోర్టులో హాజరుపర్చగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి చంద్రశేఖర్ రెండు రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి తెలిపారు.

తాడ్వాయిలో ఒకరికి..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మండలంలోని ఎర్రాపహాడ్‌కు చెందిన రాజాగౌడ్‌కు కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి చంద్రశేఖర్ రెండ్రోజుల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై మురళి తెలిపారు.

ముప్కాల్ పరిధిలో ఇద్దరికి..

బాల్కొండ: ముప్కాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నిర్మల్ జిల్లా జాఫ్రాపూర్‌కు చెందిన దర్శనం రాజేశ్వర్, తాండ్రాకు చెందిన బదావత్ సాయికిరణ్‌లకు ఆర్మూర్ ద్వితీయ శ్రేణి మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ రెండ్రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు.

ఐదుగురికి జైలు.. 15 మందికి జరిమానా

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు శిక్ష పడినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 20 మందికి నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపరచగా 15 మందికి రూ. 28వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



తాడ్వాయి (ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని కరడ్‌పల్లి గ్రామంలో బుధవారం పట్టపగలు తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన పరువాజిగారి శివాజీ రావు కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి పెళ్లి నిమిత్తం ఇతర గ్రామానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి చొరబడ్డారు. అనంతరం బీరువా తాళాలు పగులగొట్టి అందులో ఉన్న రెండుతులాల బంగారం, రూ.40వేల నగదు, వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళి తెలిపారు.

అదుపుతప్పిన కంటైనర్



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామశివారు 44వ జాతీయ రహదారిపై కంటైనర్ అదుపుతప్పింది. బుధవారం తెల్లవారుజామున నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కంటైనర్ అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఘటనలో డ్రైవర్, క్లీనర్‌లు సురక్షితంగా బయటపడ్డారు. సదాశివనగర్ పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.